క్లుప్తంగా

నేటి నుంచి 144 సెక్షన్

దొనకొండ: ఎన్నికల కౌంటింగ్ పురస్కరించు కొని 3, 4, 5వ తేదీల్లో దొనకొండ, ఇతర గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరూ గుంపులుగా గుమికూడ వద్దని ఎస్ఐ ఎల్. సంపత్‌కుమార్ తెలిపారు. శాంతి భద్రత లకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను ఆదివారం ఆయన వివరించారు. సమస్యాత్మక గ్రామాలైన ఇండ్లచెరువు, దొండపాడు, గంగదేవిపల్లి, కొచ్చెర్లకోట, రామాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని రూట్లలో మొబైల్ టీమ్ సంచరిస్తుందని, ఎక్కడ ఏ సంఘటన జరిగినా 10 నిమిషాల వ్యవధిలో గ్రామాలకు చేరుకునే విధంగా ఫోర్స్‌ను అప్రమత్తం చేశామని వెల్లడించారు. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి ఆవేశాలకు లోనై అల్లర్లకు పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు 4వ తేదీన సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

పెద్దారవీడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. యర్రగొండపాలెం మండల పరిధిలోని 79 ప్రభుత్వ పాఠశాలల్లో 9394 మంది విద్యార్థులు, పుల్లలచెరువు మండల పరిధిలో 62 ప్రభుత్వ పాఠశాలల్లో 4935 మంది, త్రిపురాంతకం మండల పరిధిలో 65 ప్రభుత్వ పాఠశాలల్లో 6782 మంది, పెద్దారవీడు మండల పరిధిలో 59 ప్రభుత్వ పాఠశాలల్లో 5650 మంది, పెద్దదోర్నాల మండల పరిధిలో 61 ప్రభుత్వ పాఠశాలల్లో 6211 మంది విద్యార్థులు చదువుతున్నారు. జూన్ మొదటి వారంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు.. ఎంఈఓలు పుస్తకాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. నాడు – నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగు పరిచారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే పూర్తి స్థాయిలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా నాణ్యతతో కూడిన విద్యా కానుకలను విజయవంతంగా విద్యార్థుల చేతికి అందజేసింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అదే ఒరవడితో ఈ ఏడాది కూడా పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందించాలన్న లక్ష్యంతో విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యార్థులకు మొదటి రోజే పంపిణీ చేయడం వల్ల దీని ప్రభావం ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది లాగానే ఈ విద్యా సంవత్సరంలో ప్రణాళిక ప్రకారం ముందే పాఠశాలలకు పంపిణీ చేస్తుండటం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా కొత్త విద్యార్థుల నమోదు కూడా పెరుగుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉత్పన్నమైన వెంటనే ముందుగా కౌంటింగ్ సూపర్‌వైజర్‌కు వెంటనే తనకు తెలపాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక కొలుకుల రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఏజెంట్ల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 6 గంటల్లోపు కౌంటింగ్ జరిగే ఒంగోలులోని రైజ్ కళాశాల వద్దకు చేరాలని, అక్కడే కేటాయించిన సమయం ప్రకారం టిఫన్, భోజన వసతులు కల్పిస్తామన్నారు. కౌంటింగ్ జరిగే సమయంలో ఏజెంట్లు ఆయా ఏవీఎంలలో పోలు అయిన ఓట్లు ఎవరికి ఎన్ని వచ్చాయి, లెక్కింపు సక్రమంగా జరుగుతుందా, లేదా అన్న విషయాలపై దృష్టి సారించాలన్నారు. 265 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను 19 రౌండ్లుగా లెక్కింపు జరుగుతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు సక్రమంగా ఉన్నాయా, అధికారి సంతకం ఉందా, ఒక బ్యాలెట్‌లో ఇద్దరు అభ్యర్థుల గుర్తులపై టిక్కులు కొట్టారా లాంటి సమస్యలతోపాటు అవి ఏ బాక్సులో వేస్తున్నారు, లెక్కింపు సక్రమంగా ఉందా అనే విషయాలు ఏజెంట్లు గమనించాలని సూచించారు. జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరె ప్రసాద్, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కె.సత్యనారాయణ చౌదరి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, వివిధ విభాగాల నాయకులు ఏకుల ముసలారెడ్డి, కందూరి కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష!

- మార్కాపురం పరిధిలో ఏడాది కాలంలో 74 ఫైర్ కాల్స్
- ఈ ఏడాది కాపాడిన ఆస్తి విలువ రూ.2.65 కోట్లు



మార్కాపురం ఫైర్ స్టేషన్



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

మార్కాపురం: అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతే శ్రేయస్కరమంటున్నారు అగ్నిమాపక శాఖ అధికారులు. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ ఏటా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా కొందరి నిర్లక్ష్యం వల్ల తరచూ అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది కూడా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, హాస్పిటళ్లు, గ్యాస్ గోడౌన్లు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, అపార్ట్‌మెంట్లు, సినిమా హాళ్లు, విద్యుత్ శాఖ కార్యాలయాలు, కళాశాలలో, పెట్రోల్ బంకుల్లో అగ్నిమాపక శాఖాధికారులు అవగాహన సదస్సులు, డెమోలు నిర్వహించారు.

జిల్లాలో 10 అగ్నిమాపక కేంద్రాలు

మార్కాపురం, ఒంగోలు, టంగుటూరు, కొండపి, కనిగిరి, కంభం, గిద్దలూరు, వైపాలెం, దోర్నాల, దర్శిలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. జిల్లాలో మూడు మిస్ట్ బుల్లెట్లు ఉన్నాయి. ఒంగోలులో రెస్క్యూ టెండర్ వాహనం ఉంది. ఏదైనా అగ్నిప్రమాదం జరిగి వాహనంలో మనుషులు ఇరుక్కున్నప్పుడు వారిని రక్షించేందుకు రెస్క్యూ టెండరు వాహనం ఉపయోగపడుతుంది. అలాగే స్విమ్మర్స్ కూడా ఉన్నారు.

ప్రమాదాలకు కారణాలు

నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడకపోవడం, ఎలక్ట్రికల్ వైరింగ్ జాయింట్‌లు ఊడిపోవడం, చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు అందుబాటులో ఉంచడం, కాల్చిన సిగరేట్లు, బీడీలు, అగ్గిపుల్లలు చల్లార్చకుండా పక్కన పడేయడం. వంటింట్లో గ్యాస్ లీకవుతున్న గమనించకపోవడం, మండుతున్న స్టౌలో కిరోసిన్ పోయడం, ఇలాంటి వాటి వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.

ఏడాదిలో ఇలా..

మార్కాపురం అగ్నిమాపక శాఖాధికారి పరిధిలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ 74 ఫైర్ కాల్స్ వచ్చాయి. సకాలంలో సిబ్బంది వెళ్లి మంటలను వ్యాపించకుండా అదుపుచేయడం వలన సుమారు 2.45 కోట్ల రూపాయల ఆస్తిని కాపాడారు. ప్రధానంగా

- గత ఏడాది డిసెంబరు 16న మార్కాపురం మండలం నికరంపల్లి వద్ద లారీ, బొలెరో వాహనం ఢీకొని పెట్రోల్ ట్యాంకులు పగిలి మంటలు అంటుకొని ఒక వ్యక్తి సజీవదహనం కాగా రూ.4.50 లక్షల నష్టం వాటిల్లింది.
- గత ఏడాది డిసెంబరు 18న పెద్దారవీడు మండలం గొబ్బూరులో పొగాకు బ్యారన్ దగ్ధమై రూ.1.90 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.
- ఈ ఏడాది మార్చి 29న మార్కాపురం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వద్ద గోనె సంచులు, ప్లాస్టిక్ గోడౌన్ ఫ్యాక్టరీలో మంటలు చెలరేగి రూ.10 లక్షల నష్టం వాటిల్లింది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఇంటిలో సురక్షితమైన విద్యుత్ పరికరాలు వాడాలి. ఎలక్ట్రిక్ పాయింట్లలో ఓవర్ లోడ్ వద్దు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పివేసి యాష్ ట్రేలో వేయాలి. గోడౌన్‌లు, ఫ్యాక్టరీల్లో మండే స్వభావం గల డస్ట్ చేరకుండా చూసుకోవాలి. ఫైర్ అలారమ్, స్మోక్ డిటెక్టర్లను, ఆటోమెటిక్ స్ప్రింక్లర్లను ఉపయోగించుకోవాలి. ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. దుస్తులకు నిప్పు అంటుకుంటే నేలపై దొర్లి దుప్పటి చుట్టుకోవాలి. నీటి సౌకర్యం అందుబాటులో ఉంచుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం అందించండి.

– ఆర్.రామకృష్ణ, మార్కాపురం ఫైర్ అధికారి

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి

- గ్రామాల్లో అల్లర్లు వద్దు
- ఎన్నికల కమిషన్, పోలీసులకు సహకరించండి
- బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



దర్శి: కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఏజెంట్లు తమ సహకారం అందించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ నెల 4న కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి పూర్తయ్యే వరకు లెక్కింపు పైనే దృష్టి పెట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే అక్కడ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎటువంటి గొడవలు, హింసాత్మక ఘటనల్లో పాల్గొన వద్దని సూచించారు. సలహాలు సందేహాలకు ఎన్నికల అధికారులతో మాట్లాడి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్‌కు, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సుహాసిని పూజ



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగాభవాని అమ్మవారు



సుహాసిని పూజా కార్యక్రమంలో ముత్తైదువులు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం గుంటిగంగాభవాని అమ్మవారి ఆలయంలో ఏకాదశి ఆదివారం 108 మంది ముత్తైదువులతో అత్యంత భక్తిశ్రద్ధలతో సుహాసిని పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుహాసిని పూజా కార్యక్రమం సందర్భంగా ఆలయ పూజారులు కామేశ్వరరావు, ప్రకాశరావు, బాలరాజులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజ వలన సకల సౌభాగ్యాలు కలిగి ఆయురారోగ్యాలతో విరాజిల్లాలని దీవించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కార్తీక్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కమనీయం.. ఆంజనేయస్వామి కల్యాణం



అభయాంజనేయ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



గోవింద నామ స్మరణ చేస్తున్న మహిళలు

కొనకనమిట్ల: హనుమత్ జయంత్యుత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఆదివారం అభయ వీరాంజనేయస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సువర్చలా, అభయ వీరాంజనేయస్వామి ఉత్సవమూర్తులను వేద పండితులు వినుపాముల రామకృష్ణశర్మ, శేఖరశర్మ శోభాయమానంగా అలంకరించి కల్యాణ క్రతువును పూర్తి చేశారు. రామతారక మంత్ర ప్రాశస్త్యం, సువర్చలా సహిత ఆంజనేయస్వామి వివాహ ఘట్టం గురించి వివరించారు. స్వామివారికి గ్రామ పెద్దలు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పలు రకాల పూలతో పుష్పాభిషేకం చేశారు. ముందుగా భక్తులు ధ్వజస్తంభం వద్ద టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పన చేశారు. రాత్రి అభయాంజనేయస్వామి, సువర్చలాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.



అభయాంజనేయస్వామి గ్రామోత్సవం

పోలేరమ్మకు జలాభిషేకం



పోలేరమ్మకు జలాభిషేకం చేస్తున్న భక్తులు



నీటి బిందెలతో క్యూ కట్టిన భక్తులు

దర్శి: పట్టణంలోని పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో జలాభిషేకం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తలంటు స్నానాలు చేసి బిందెల నిండుగా నీరు తెచ్చి అమ్మవారికి నీటితో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం



విద్యార్థులకు కథలు చదవడం నేర్పుతున్న ఉపాధ్యాయులు

మార్కాపురం: పుస్తక పఠనం, బ్రెయిన్ గేమ్స్ ఆడటం వల్ల తెలివితేటలను పెంచుకోవచ్చని ఉపాధ్యాయుడు ఓ.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 16వ రోజు ఆదివారం విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష చేయించడం, చదరంగం, బ్రెయిన్ గేమ్స్‌తోపాటు పాటలు పాడటంలో మెళకువలు నేర్పారు. గ్రంథపాలకులు జీవీ శివారెడ్డి మాట్లాడుతూ.. పుస్తక పఠనం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. గట్టిగా చదవడం వల్ల విద్యార్థులకు బాగా గుర్తుంటుందని చెప్పారు. చారిత్రాత్మక పుస్తకాలు, నీతి కథలు చదవడం వలన చరిత్రతో పాటు సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయన్నారు.

కోట సత్యమాంబ దేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమబండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

గౌరవనీయులైన మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP. 184/2015 in O.S.50/2014
కందసూలు కొండారెడ్డి ....D.Hr.
Vs
గోనా ఆస్తకుమారి ....J.Dr.

వేలం ప్రకటన

పై నెంబరులోని EP షెడ్యూలు ఆస్తిని DHr బాకీ రాబట్టు నిమిత్తం ఘనమైన కోర్టులో 22-06-2024 తేదిన ఉదయం 10.30 నుండి సాయంత్రం 5-00 గంటలలోపు బహిరంగ వేలం వేయుటకు కోర్టు వారు నిర్ణయించడమైనది. ఈ బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు పాల్గొనవచ్చును. షరతులు వర్తిస్తాయి.
షెడ్యూలు: ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్ కంభం సబ్‌డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ కందులాపురం గ్రామ పంచాయితీకి చెందిన కందులాపురం గ్రామ ఇలాకా స.పి.నెం.174/13లోని డోర్ నెం. 8-10 గల మిద్దెకు హద్దులు ఉత్తరం: లింగు పచ్చి రంగమ్మ మిద్దె, దక్షిణం: ఫ్యాక్టరీకి పోవు రోడ్డు, తూర్పు: రోడ్డు, పడమర: నంది రోడ్డు. తూర్పు-పడమర: 53 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 23 అడుగులు

విలువ	: 4,00,000.00
అమీనా విలువ	: 4,50,000.00
మార్కెట్ విలువ	: 9,11,024.00
వేలము తేది	: 22-06-2024

ఫర్దర్ హియరింగ్ తేది: 28-06-2024
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
పోతిరెడ్డి బాలరంగారెడ్డి
DHr తరుపు న్యాయవాది, మార్కాపురం.
సెల్: 94402 50889

ఇనుప స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం



పొదిలి సబ్ స్టేషన్ పక్కనే ఓ వీధిలో ఇనుప స్తంభం

పొదిలి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఇనుప స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలంలో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న స్తంభాలకు విద్యుత్ ప్రసరించడంతో ఆ పరిసరాల్లో షాక్ వచ్చిన సందర్భాలున్నాయి. గత వర్షాకాలం ముందుగానే అన్ని స్తంభాలు మార్చివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెప్పారే కానీ ఇప్పటికీ కొన్ని చోట్ల పరిస్థితి అలానే ఉండటంతో భయాందోళన వ్యక్తమవుతోంది. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఇనుప స్తంభాలు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ గ్రంథలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు చదవడం, ఇంగ్లిషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిషు, చెస్, డ్రాయింగ్‌లపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరానికి 27 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

బేస్తవారిపేటలో వర్షం

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు 39-40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండటంతో ఎండ తీవ్రతతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం మంచి వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. కంభం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బేస్తవారిపేట వరకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ తెగిపోవడంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

పుల్లలచెరువు: ఈ నెల 4 కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుల్లలచెరువు ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా హెచ్చరించారు. ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించి అన్ని ప్రాంతాలను పరిశీలించి గ్రామస్తులకు తగు సూచనలు చేశారు. ప్రస్తుతం 144 సెక్షన్‌తో పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిపారు. అవసరమైన గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని తెలిపారు. మండల కేంద్రంలో పాటు అనుమానిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో గొడవలు సృష్టించుకుని పచ్చగా ఉన్న పల్లెలను పాడు చేసుకోవద్దని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లోని యువత గొడవలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ఏలా ఉన్నా రాజకీయ పార్టీలు, ప్రజలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లుగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్లు భర్తీ

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో 2024 - 2025 విద్యా సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రిన్సిపాల్ కె. పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 11తేదీ లోపు స్థానిక పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం 13వ తేదీ జరిగే రాత పరీక్షకు హాజరు కావాలన్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన మిగులు సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకొని రాత పరీక్షకు హాజరు కావాలని కోరారు.